ఆదివారం
ప్రజాశక్తి
ఫిబ్రవరి 3, 2002

కుష్టు నిర్మూలన నత్తనడక

లోపలిపేజీలో
హ్యాపీ బర్త్‌డే

శుభాకాంక్షలతో...

భాగ్యలక్ష్మి

మోడ్రన్ రైస్‌మిల్

ధర్మోగూడెం, చౌటుప్పల్ (మం), నల్గొండ జిల్లా.

Best Compliments from...

☎ 43404

కొడాలి & సన్స్

కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని)

గుడివాడ - కృష్ణాజిల్లా - 521 301

...పల్లి
...దీప్,
...వ తరగతి
...ముపిఎస్
స్కూల్,
...కట్లపాలెం,
...ోనకల్

పి.వి.
...ఘువేంద్ర,
...వ తరగతి
వాసవి
...ోరియల్స్
...ంభం,
...శం జిల్లా

...లేదు. ఇప్పుడు అదే ప్రయత్నంలో ...ం అన్నాడు. ఆ సమాధానం విన్న రాజు ...ా నవ్వాడు. తెనాలి రామకృష్ణుడి తప్పు ...ది రాజ్యంలోనే ఉండమని చెప్పాడు.

మాటలకోట-42

1		2	✿	3	✿	4	✿	5	
	✿	6		✿	7	✿	8		✿
✿	9		✿	10				✿	11
12		✿	13			✿	14	15	✿
✿	16				✿	17	✿	18	
19		✿		✿	20		21		✿
✿	22	23	✿	24		✿		✿	25
26	✿	27	28		✿	29		✿	
30	✿			✿	31		✿	32	
	✿	33			✿	34			✿

అడ్డం

1. అనవసరపు ఖర్చు (3)
3. 'న'కారంతో పరుగు (1)
5. సముద్రం కంటే చిన్నది (2)
6. రెండు నిలువులో పాఠశాల (2)
8. మార్జాలం (2)
9. తేమ (2)
10. అటునుండి తామరలు (4)
11. 'టు' చేరిస్తే ఇంగ్లీషులో దారి (1)
12. ఇది చేసే మేలు తల్లికూడా చేయదట (2)
13. ఆపద (3)
14. ప్రాణం (2)
16. యుద్ధయాత్ర (4)
18. మోసం (2)
19. జుట్టులో ఉండి చిరాకు పెట్టేది (2)
20. శంక (4)
22. తిరగబడ్డ పాలు (2)
24. ఫాక్స్ (2)
27. చిలకను బంధించేది ఇందులోనే (3)
29. గొంతు (2)
30. కూరలో వాడేది (2)
31. చెట్టు (2)
32. భర్త, రాజు (2)
33. ఎక్కువ (3)
34. కిటికీ (3)

నిలువు

1. ధూళి (2)
2. ఆదాయం (3)
5. మంచంలో దూరి కుట్టేది (2)
7. అడ్డం 22 మరో రకంగా (3)
8. హిందీలో నాన్నగారు (3)
9. మాతాపితలు (5)
10. తడబడ్డ మాత్రలు (3)
13. శ్రమ (3)
15. నమస్కారం (3)
17. చూచు (2)
20. సోదరి (2)
21. మూలం (3)
23. పుణ్యానికి వ్యతిరేకం (2)
24. నరాలు...ఒకటే (2)
25. ఒక నది (3)
26. బాకీ (3)
28. సముద్రం (3)
29. శవం (3)
32. పదిహేను రోజులు (2)

గతవారం జవాబులు

అడ్డం : 1. కాకి 2. దో 3. మితం 4. యుద్ధం 5. దా 6. బత్తి 7. ముక్తి 8. డాబా 10. సడి 11. ఒప్పు 13. వినతి 15. తిట్టు 16. బాతు 17. ద్వా 18. మీరు 19. న 20. తామకు 22. పస్తు 24. కోపం 25. సుమతి 27. చాకిరి 28. చేమంతి 29. పారాణి 30. లడాయి 32. లేఖ 34. మని 35. నౌ 36. చెట్టు

నిలువు : 1. కాగడా 3. మిత్తి 4. యుక్తి 6. బడి 7. ముప్పు 9. బావి 10. సతి 11. ఒట్టు 12. చాతుర్యం 14. నన్నము 15. తిరుపతి 20. తాపం 21. కుసుమం 23. కింకిణి 24. కోవెల 26. మతిలేని 27. చారానా 28. చేయి 31. దాగు 32. గట్టు

ఎవరతను : ఆ బాలుడు ఆలోచిస్తున్నది తన గురించే

నలుగురు విద్యార్థులు

లెక్చరర్ | పంక్చర్

క్లాసుకు ఆలస్యంగా వచ్చారు. కారణం ఏమిటని లెక్చరర్ అడిగితే తాము వచ్చిన బస్సు టైరు మధ్యలో పంక్చర్ అయ్యిందని సమాధానం చెప్పారు. అయితే లెక్చరర్‌కు ఆ సమాధానం నమ్మకంగా అనిపించలేదు. వారు అబద్ధం చెబుతున్నారని గ్రహించాడు. వారు చెబుతున్నది అబద్దమని చెప్పి అది నిరూపించాడు. విద్యార్థులు చెబుతున్నది అబద్ధమని లెక్చరర్ ఎలా నిరూపించాడో కనుక్కోగలరా ?

రివర్స్ గేర్..!

రుక్మిణి

అబ్బో..! రావిచెట్టు చప్టా దగ్గర 'వేలంపాట' యమా జోరుగా సాగిపోతుంది. చుట్టూ గుంపులు.. గుంపులు జనం.. రావిచెట్టు మీది కాకులు ఆ హడావిడికి కావుకావుమని ఎటో ఎగిరి పోయాయి. జక్కులోడు కసిగా నడుంకు తువాలు బిగించి నోరంతా వికారంగా తెరిచి గట్టిగా కాకిలా కావు.. కావుమని 'వేలం'పాట పాడుతూనే, ప్రక్కనే నుంచున్న వాడి పెండ్లాం వంకే కసిగా.. మింగేటట్లు చూస్తున్నాడు. ఆవిడేమో కునారిల్లుతూ.. గుడ్లనీరు కుక్కుకుంటూ... ఒంటినిండా పమిట కప్పుకుని నేల చూపులు తాటిస్తూ... మహాపరాధిలా మధ్య మధ్య మిర్రి మిర్రి చూస్తుంది.

"వెయ్యి రూపాయలు బాబూ.. వెయ్యి రూపాయలు" కాకిలా వాడు గొంతు చించుకుని అరుస్తూనే వుంటే - ఆవిడేమో జాలిగా చుట్టూ జనాలవంక ఆర్తిగా చూస్తూ నుంచుంది. యాద్గిరి.. మల్లేశూ రాతి కట్ట మీద ఏమీ పట్టనట్టు చూస్తూ కూర్చున్నారు.

"ఏడు వందలు.." నారిగాడు కీసర బాసరగా అరవంగానే వాడి పక్కనే నుంచున్న వాడి బక్కపెండ్లాం వాడి డొక్కలో ఒక కుందాపోటు పొడవడంతో వెంటనే వాడు నోరు మూసుకున్నాడు.

"అరె.. నోళ్లు కుట్టేసుకున్నార్ర.. బంగారంలాంటి సరుకు - అవతల టైమైపోతంది.. అరె.. అసలు.. దీన్ని..!" జక్కులోడు పెండ్లాం మీద ఓ వురుము ఉరిమి మళ్ళా 'పాట'కు తగులుకున్నాడు.

"నాలుగు వందలు..!" గుంపులోనుండి ఎవడో అరవంగానే జక్కులోడు వాడ్ని ఓ నిమిషంపాటు పరమ కిరాతకంగా బూతులు తిట్టి - సర్దుకుని "మీరసలు వేలం పాట రూల్సు పట్టించుకోడం లేదు. పరాచికాలు కావు. సరసమైన సరుకు! ఆలసించిన ఆశాభంగం! నియమించుకున్న సమయం మించి పోవుచున్నది!" అని పెండ్లాంకేసి కొరకొరా చూసి రెండు వికారపు తిట్లు తిట్టి హఠాత్తుగా కుదేలైపోయాడు.

"ఒక రూపాయ!" ఆ 'పాట' విని జక్కులోడు తలపట్టుకున్నాడు. "అవునే - దరిద్రగొట్టు మొహవా.. అనుకున్నంతా అయ్యింది.. సరె గానిర.. అసలే ఈ ముదనష్టందాన్తో వేగలేక పోతున్నా.. కాస్తంత మీరంతా దయజూపాలె! పేదముండా వాణ్ణి.. ఎక్కువ యిచ్చుకోలేను. మరీ నరం సాగదీసినట్లు సాగదీస్తే నాకు నరకమే గతి!"

వాడు జనాల్ని బతిమిలాడుకుంటున్నా నా బుర్రంతా అయోమయంలో పడి పోయింది. అసలీ వేలంపాటా... వేలం వెర్రి... అవతల వాడి పెండ్లాం... ఈ జనాలు.. చివరి పాట వెయ్యి రూపాయల్నుండి... ఒక్కటంటే.. ఒక్క రూపాయకు.. ఇదేందీ... అరె...

"ఏంలేదే అన్నా.. కచ్చితంగా పది నిమిషాల్లో 'పాట' అయిపోవాలె! ఇంకా చాలా మందిమి వుంటిమాయె... గిపుడు మళ్ళా రూపాయనుండి 'పాట' పెంచుడే వుంటది. అంటే అదికాదే.. ముందు వెయ్యి సర్కారు పాట.. అయితే అంతకన్నా తక్కువకే ఈ పది నిమిషాల్లో 'పాట' పాడి 'ధర' దగ్గర సెటిల్మెంటు చెయ్యాలె..."

ఓర్నీ కలికాలం.. జక్కులోడికీ.. వీళ్ళందరికీ.. పిచ్చిగాని దిగదీసిందా? అక్కడేమో జక్కులోడి పెండ్లాం... అసలీ వేలంపాట ఏంటీ?

మల్లేశూ, యాద్గిరీ నా వాలకం చూసి పడీపడీ నవ్వి అటు గుడి గోపురం పక్కనే అరుగు చూపించారు. అక్కడ గవర్మెంటు డాక్రా గాసు సిలిండర్లు వరసగా పేర్చి చాలా ముచ్చటగా వున్నాయి.

"అదే అన్నా - వాడి పెండ్లాం.. డాక్రా.. గా సిలిండర్లను వేలంపాటలు వేస్తంర్రు - అవి చెంద్రబాబు గారిచ్చినప్పటి నుండీ - గాసు ధర పెరిగీ పెరిగీ మన కాలి కొంకులిరిగి పాయెనా? మళ్ళా గిపుడు మరో 90 రూపాయలు పెంచితే నడుములు కూడా వూరాగా యిరిగిపోతయని వాటిని ఎట్లనో వదిలిచ్చుకుంటున్నం! అబ్బ.. పాట వినవే..!"

"వంద!" ఎవడో గుంపులోనుంచి అరవగానే జక్కులోడు గుడ్లనీరు గుక్కుకుంటూ 'వం.. దా' అని నీరసంగా మూలిగి పెండ్లాన్ని ఈసడింపుగా చూశాడు. "మూడు నిముషాలు" పొట్టి వెంకట్రావు గడియారం వూపుతూ హుషారు చేస్తున్నాడు. నాకేమో బుర్ర మళ్ళీ తిరుగుడు ప్రారంభమయింది.

"అన్నా.. గిపుడు పాడేపాట ధర ఎంతలో సెటిలయితే గా డబ్బులు జక్కులోడు గా పాటపాడినోడికి గా సిలిండరుతో పాటు కలిపి యిచ్చేయాలన్నమాట! ఇది ఆ పాట పాడినోడికి వీడు ఎదురిచ్చే 'పోటుపాట' అంతా రివర్స్.. వాటిని వదిలిచ్చుకోవాల్నాయె!"

వామ్మో! ఇదేదో బాగా కాని పని లాగానే వుంది. పదీ - ఇరవై పెరుగుతుంటే జక్కులోడు నీరసించి పోతూనే వున్నాడు. పెండ్లాన్ని గ్యాసుబండ కొంపమీదికి తెచ్చినందుకు తిడుతూనే వున్నాడు. ఆవిడ బొటబొట కన్నీరు పెడుతూనే వుంది!

"నీ గాసుకునా.. నీ సిలిండరుకునా... రెండు వందలా పదీ.. పదీ.. పదీ!" అని నిర్ణీత సమయం కావడంతో జక్కులోడు అమాంతం నీరసించి విరుచుకు పడిపోయాడు. వాడి పెండ్లాం ఆపసోపాలు పడుతూ నీళ్ళకోసం పరుగు తీసింది.

దొబ్బ ఈరసామి గబగబ చప్టా మీదెక్కి పాటకు తగులుకున్నాడు.

"ఒరే.. ఒరే.. వెయ్యి నుండి కిందకూ మీదకూ కాదు. ఈ దీపం గాసు దెబ్బకు నా చిలుం ఎంత వదిలించుకోవాల్నో.. గంతే.. తప్పదుగద... ఒక్క రూపాయి నుండే రివర్సు పోటుపాట మొదలు పెడతా..! అని కీసరబాసరగా పాటకు తగులుకున్నాడు.

"అన్నా... ఇపుడు జక్కులోడి ఖాళీగాసు సిలిండరు పాటపాడి తీసుకుంది పాత ఇనప దుకానం వాడు. దాన్ని ఖండఖండాలుగా పగలేసి తుక్కు కింద అమ్ముకుంటాడేమో. ఎట్లాగూ మన జక్కులోడే ఓ రెండొందల పది రూపాయలు ఎదురిస్తున్నాడుగా! అదీ లాభమే! గీడ సిలిండర్లున్నోళ్ళు పాటపాడొద్దాయె - రూలు - పీకులాట! అంతా డాక్రా గుంపేనాయె!" యాద్గిరి బీడీ వెలిగించి ఖాండ్రించి వుమ్మాడు.



నేను నివ్వెరపడిపోయి - రాం నాయక్‌నూ.. వెంకునాయుడ్నీ... చెంద్రబాబునూ తలుచుకుని గుబగుబలాడి పోయాను. ఈ జనాలనుండీ.. మంత్రులనుండీ చాలా మతలబులూ.. నేర్చుకోవాల్సిన నీతులూ చాలానే వున్నై! అయితే చివరికి మల్లేశూ, యాద్గిరి దీని గురించిన ఒకటి రెండు నీతి వాక్యాలు కూడా నాకు చెప్పారాయె!

యాద్గిరి : "గీ దరిద్రం గాసు సిలిండర్లు ఇండ్లిల్ల ఖాళీగానె పడివుండె! గాసు ధరలు మోతమోతగా పెంచుడేనాయె - ఖాళీ గాసు సిలిండర్ని కొంపలో యాడ పెట్టుకుందామన్నా జాగే లేకపోయే! పోరగాండ్ల కాళ్ళకు తగిలి మీద బడితే కాళ్ళిరుగుడాయె! తల్లి - అటక మీదెక్కిద్దామంటే అదిగానీ పుటుక్కుమందా - మీద కూలి పక్కటెముకలిరిగి పోతాయిగద! ధు.. నీ గాసుకునా...

మల్లేశు: "ఈ ఎలక్సన్లు కాంగానే గాసు ధర మరో 90 రూపాయిలు పెంచితే గీ వున్న గోచీ కూడా వూడిపోద్ది - గివేమో వాడకం లేక చిలుం పట్టి పోతున్నాయి గద... చిలుం నాకడానికి పింజర పావు లూస్తండె.. చెంద్రబాబేమో మళ్ళీ గివే ఇచ్చి జనాలను జల్మభూవుల్లో చప్పట్లు... ఓట్లు అడుగుదామని ప్లాన్లు చేస్తండు - రివర్సు నాటకాలు.. ధు.. ధు...!" ★

సంచనాలతో హోరెత్తిన ఆస్ట్రేలియా ఓపెన్

ఎం.కె.రాంప్రసాద్

ఈ నెల 15న ప్రారంభమై 27న ముగిసిన ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆద్యంతం అత్యంత ఆసక్తిదాయకంగా జరిగాయి. గ్రాండ్‌శ్లామ్ పోటీల్లో ఏడాది ప్రారంభంలో జరిగే ఈ టోర్నీ ఆది నుండే సంచలనాలతో ఆరంభమైంది. మాజీ వరల్డ్ నంబర్ వన్, ఈ టైటిల్ హాట్‌ఫేవరేట్‌గా భావించిన అగస్సీ గాయంతో తప్పుకోగా గాయంతో బాధపడుతూ తన ప్రారంభ మ్యాచ్‌ను వాయిదా వేయాలనే తన విన్నపాన్ని నిర్వాహకులు ఆమోదించకపోవడంతో విలియమ్స్ సోదరీమణుల్లో ఒకరైన సెరీనా విలియమ్స్ కూడా తప్పుకోవాల్సిరావడంతో ఈ టోర్నీకి ఒక రకంగా ఆదిలోనే అపశృతి ఎదురైంది. వరల్డ్ నంబర్ వన్ హెవిట్ తొలి రౌండ్‌లోనే పరాజయంపాలై వెనుదిరగడం మరో సంచలనం. ఆస్ట్రేలియా మొదటి మూడు రౌండ్లలోనే వెనుదిరగడం ఆస్ట్రేలియా ఓపెన్ చరిత్రలో మరో రికార్డు. ఒకానొకప్పుడు అగ్రశ్రేణి క్రీడాకారులతో ప్రపంచ టెన్నిస్‌నే శాసించే స్థాయిలో ఉన్న ఆస్ట్రేలియాకు ఇది పరాభవమేనని చెప్పాలి. నంబర్‌వన్ క్రీడాకారుడు తొలిరౌండ్‌లో ఓడిపోవడం ఆస్ట్రేలియా ఓపెన్ చరిత్రలోనే ఇది మొదటిసారి. అతిపిన్న వయసులో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలిచి 'ఛాంగ్ భళారే' అనిపించుకున్న మైఖేల్ ఛాంగ్ తొలిరౌండ్‌లోనే పరాజయం పాలయ్యాడు. వీరిద్దరూ అనామకులు చేతుల్లో ఓడిపోవడం గమనార్హం. పరాజయాలే తన ఇంటి పేరుగా మార్చుకున్న 'మిస్‌పరాజిత' అన్నా కోర్నికోవాకు కూడా తొలిరౌండ్‌లేనే చుక్కెదురైంది. అయితే హింగిస్‌తో కలిసి డబుల్స్ టైటిల్ గెలుచుకోవడం ఆమెకు కొంత ఊరట కలిగించింది. ఇటీవల అనామకురాలిగా మిగిలిపోయిన అలనాటి నంబర్‌వన్ క్రీడాకారిణి మోనికా సెలెస్ మళ్ళీ సంచలనాల బాటలో పయనించి మునుపటి వేడి, ప్రాభవం ఇంకా మిగిలిఉందని నిరూపించింది. సెమీస్ వరకూ ఎదురులేకుండా దూసుకువచ్చిన సెలెస్‌కు సెమీస్‌లో మార్టినా హింగిస్ రూపంలో ప్రతిబంధకం ఎదురైంది. క్వార్టర్ ఫైనల్‌లో వీనస్ విలియమ్స్‌ను ఓడించిన సెలెస్ సెమీస్‌లో హింగిస్ చేతుల్లో ఓడిపోయింది. ఫైనల్‌వరకూ ఎక్కువ గేమ్‌లు కోల్పోకుండా గ్రాండ్‌శ్లామ్ టైటిల్ కోసం తపించిపోతున్న మార్టీనా హింగిస్ ఫైనల్లో వరల్డ్ నంబర్ వన్ జెన్నిఫర్ కాప్రియాతి చేతుల్లో తలవంచకతప్పలేదు. తన కంటే నాలుగేళ్ళు పెద్దదైన కాప్రియాతి తనపై వరుసగా రెండవసారి విజయం సాధిస్తుందని ఆమె ఊహించిఉండదు. గత ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్‌లో కూడా వీరిద్దరే ఫైనల్లో తలపడ్డారు. ఆస్ట్రేలియా ఓపెన్‌లో గత ఆరేళ్ళుగా ఫైనల్‌కు చేరుకుంటున్న హింగిస్‌కు టైటిల్ గగనకుసుమంగా మారింది. 1999లో ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ తరువాత ఆమె ప్రధాన టైటిల్ ఏదీ గెలుచుకోలేకపోయింది. ఈ ఏడాది చూపుతున్న ప్రతిభను పరిగణలోకి తీసుకుంటే ఆమె హాట్‌ఫేవరేట్‌గా పరిశీలకులు భావించారు. ముఖ్యంగా 1991, 92, 93ల్లో వరుసగా మూడేళ్ళపాటు ఈ టైటిల్ గెలుచుకున్న సెలెస్‌పై మొదటి సెట్‌లో ఓడిపోయినప్పటికీ తరువాత పుంజుకుని గెలిచిన తీరు ఆమె అద్భుత ఫామ్‌ను తెలుపుతోంది. వీనస్ విలియమ్స్‌ను చిత్తు చేసిన సెలెస్‌పై గెలుపు ఆమె ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపచేసింది. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ గత ఏడాది అద్భుతాన్నే కాప్రియాతి ఈ ఏడాది కూడా కొనసాగించింది. టైటిల్‌తోపాటు తన నంబర్ వన్ ర్యాంకును కూడా ఆమె పదిలం చేసుకోగలిగింది. ఐదు గ్రాండ్ శ్లామ్ టైటిల్స్ గెలుచుకున్న హింగిస్ మరో టైటిల్ కోసం యుఎస్ ఓపెన్ వరకూ ఆగకతప్పదు. డబుల్స్ టైటిల్‌తో ఆమె సంతృప్తి పడాల్సి వచ్చింది. ఇంతకుముందు డబుల్స్ టైటిల్ గెలుచుకున్న ప్రతిసారీ సింగిల్స్ టైటిల్ కైవసం చేసుకున్న హింగిస్‌కు ఈ సారి నిరాశతప్పలేదు. హింగిస్ మ్యాచ్‌పాయింట్లను బ్రేక్ చేసి టైటిల్ గెలుపొందడం ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నీలో ఇది రెండవ సారి మాత్రమే. ఇంతకుముందు 1956లో మేరీ కార్టర్ మాత్రమే ఈ ఘనత సాధించింది. ఇక పురుషుల విభాగంలో రష్యాకు చెందిన మారత్ సాఫిన్ ఆద్యంతం మంచి ప్రతిభ కనబరిచి టైటిల్ ఎగరేసుకుపోతాడనిపించాడు. ముఖ్యంగా ప్రీక్వార్టర్ ఫైనల్లో మాజీ వరల్డ నంబర్ వన్ పీట్ సాంప్రాస్‌ను ఓడించి సాఫిన్ సంచలనం సృష్టించాడు.

2000 యుఎస్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న సాఫిన్ రెండవ గ్రాండ్‌శ్లామ్ టైటిల్‌కోసం కన్నకలలు ఫైనల్లో భగ్నమయ్యాయి. ఎవరూ ఊహించని రీతిలో పురుషుల టైటిల్‌ను స్వీడన్‌కు చెందిన థామస్ జోహాన్సన్ ఎగరేసుకుపోయాడు. 1998 తర్వాత ఈ టైటిల్ స్వీడన్‌కు దక్కడం ఇదే ప్రథమం. 1998లో మాట్స్ విలాండర్ ఈ టైటిల్ కైవసం చేసుకున్నాడు. థామస్ జోహాన్సన్ తొలి గ్రాండ్‌శ్లామ్ టైటిల్ గెలుచుకోవడానికి 25 టోర్నీల్లో ఆడాల్సివచ్చింది. ఆమాటకు వస్తే గ్రాండ్‌శ్లామ్ టైటిల్ గెలుచుకోవడం ఆషామాషీ కాదు. గత ఏడాది వింబుల్డన్ టైటిల్ కైవసం చేసుకున్న గోరాన్ ఇవానిసెవిక్ తొలిసారిగా గ్రాండ్‌శ్లామ్ టైటిల్ గెలుచుకోవడానికి 48 టోర్నీలపాటు వేచియుండాల్సి వచ్చింది. అలాగే పీటర్ కోర్డా తన 34వ టోర్నీలో గ్రాండ్‌శ్లామ్ టైటిల్ హస్తగతం చేసుకున్నాడు. సాఫిన్, జోహాన్సన్ ఇంతకుముందు మూడుసార్లు తలపడ్డారు. ఇందులో రెండుసార్లు సాఫిన్ గెలుపొందగా ఒకసారి విజయం జోహాన్సన్‌ను వరించింది. ఇక భారత్ విషయానికి వస్తే మహేష్ భూపతి సింగిల్స్‌లో రెండవ రౌండ్‌లో ఓడిపోగా ఎలీనా లిఖౌత్‌సేవాతో ఆడిన మిక్స్‌డ్ డబుల్స్ జంట సెమీస్‌వరకూ వచ్చింది. జూనియర్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన సానియా మీర్జా సింగిల్స్‌లో, డబుల్స్‌లో రెండవరౌండ్ వరకూ పరిమితమైంది. ఇక ముక్తాయింపుగా రాయ్ ఎమర్సన్, టోనీరోష్, కెన్ రోజ్‌వెల్ వంటి ఉద్దండపిండాలతో ప్రకాశించిన ఆస్ట్రేలియాకు ఈ టోర్నీ పీడకలగా పరిణమించింది. 70వ దశకం తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 1976 తర్వాత ఆస్ట్రేలియా ఈ టైటిల్ గెలుచుకోలేదు. ఈటోర్నీలో దాని పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. 97 ఏళ్ళ ఆస్ట్రేలియా ఓపెన్ చరిత్రలో ఇంతకు ముందెన్నడూ లేని విధంగా ఆస్ట్రేలియా క్రీడాకారులు కనీసం రెండవ రౌండ్‌కు సైతం చేరుకోలేకపోయారు. అటు కొత్తరక్తం వస్తున్నప్పటికీ సెలెస్, కాప్రియాతి, హింగిస్ వంటి వారు తమలో ఇంకా చేవ ఇంకా చెక్కుచెదరలేదని నిరూపించుకున్నారు. వచ్చే మేనెలలో జరగనున్న యుఎస్ ఓపెన్ మరింత పోటాపోటీగా జరుగుతుందని ఆశించవచ్చు. ★

దులపాల్సిన దుమ్ము

సునీత ఏలూరి



"నారాయణరావుగారి భార్య మళ్ళీ వెళ్లిపోయార్ట!" బట్టలు మడతేస్తూ భర్త రంగారావునుద్దేశించి అంది విజయ.

"ఆంటీ మళ్ళీ వెళ్ళిపోయారా! ఎక్కడికి?"

కొంచెం కుతూహలం, మరికొంచెం ఆశ్చర్యం ప్రకటిస్తూ అడిగింది సుధ తాగుతున్న కాఫీ మరో రెండు గుక్కల్లో ఫినిష్ చేసి ఖాళీ కప్పు టేబుల్ మీద పెడ్తూ

"ఎక్కడికో ఎవరికి తెలుసు!? మళ్ళీ పిచ్చి ముదిరుంటుంది. అసలు నన్నడిగితే ఆవిడ్ని ఏ పిచ్చాసుపత్రిలోనో జాయిన్చేయాల్సింది. పిచ్చి కుదిరేది!" ఉచిత సలహాను అడక్కుండానే చెప్పాడు రంగారావు.

నిశ్శబ్దంగా పేపరు చదువుకుంటున్న సౌమ్య వీళ్ళ మాటలు వింటూనే వుంది. రంగారావు ఏదో పనుందని బయటకెళ్ళాడు.

సౌమ్య చిన్నగా వాళ్ళమ్మ దగ్గరకు వెళ్ళింది.

బట్టలు మడత పెట్టటం పూర్తైనాక, అంతకుముందే కడిగి పెట్టిన గిన్నెలు అలమారాలో సర్దుతున్న విజయ దగ్గరగా వచ్చి ఏదో అడగాలని సందేహంగా నిల్చున్న సౌమ్య వంక చూసి చిన్నగా నవ్వుతూ 'ఏంటి' అన్నట్టుగా కనుబొమ్మ లెగరేసింది.

సౌమ్య గిన్నెలు సర్దటంలో సహాయం చేస్తూ "అమ్మా! ఆంటీ ఎందుకు వెళ్ళిపోయారంటావు?" అడిగింది.

"ఏమో! ఎవ్వరికీ తెలీదు. ఇలా చేయటం మూడోసారి ఈ రెండునెల్ల కాలంలో" అంది విజయ.

"కాదమ్మా నిన్నసాయంత్రం ఆనందన్నయ్య వాళ్ళ దగ్గిర మాథ్స్ చెప్పించుకోటానికెళ్ళినపుడు ఆంటీ నాతో మాట్లాడారు"

"ఏం మాట్లాడారు?!" సుధ అడిగింది.

సౌమ్య కన్నా సుధ నాల్గేళ్ళు చిన్నది. సుధ వంక చూడకుండానే సౌమ్య

"చాలా బాగా మాట్లాడారు. టీ కూడాఇచ్చారు. అమ్మేం చేస్తుందని అడిగారు. కాని చాలా అలిసిపోయినట్టుగా కనిపించారు. ఇంతలోనే మళ్ళీ పిచ్చి! వెళ్ళిపోవటం...అర్థం కావట్లేదు."

"నీతో ఎన్నింటికి మాట్లాడారు?" గ్లాసులో నీళ్ళు తీసుకుంటూ అడిగింది సుధ.

"ఆరున్నరకీ"

"ఆంటీ ఏడు గంటల్నించి కనపట్టం లేదు. అంకుల్ వాళ్ళు చూసుకునే సరికి తొమ్మిదయింది. బస్టాండు, రైల్వేస్టేషన్‌కి వెళ్ళి వెతికారు. లాభం లేకపోయింది" అంది విజయ.

"ఛ! ఆంటీ ఎందుకిలా ఇబ్బంది పెడుతుంది అందర్నీ?" సుధ విసుక్కుంది.

"మీకు తెలుసా! ఆంటీని అంకుల్ చాలా బాగా చూసుకుంటారు." సౌమ్య, విజయ ఇద్దరూ ఒక్కసారిగా సుధవైపు చూశారు.

"బాగా చూసుకోవటమంటే?" చేస్తున్న పనాపి ప్రశ్నార్థకంగా అడిగింది. పన్నెండేళ్ళ పిల్లకి బాగా చూసుకోవటమంటే అర్థమేం తెలుసోనని విజయ ఆశ్చర్యంగా చూసింది.

"అంటే.... అంటే..." నీళ్ళు నములుతూ... ఒక్కసారిగా స్ఫురించినట్టు 'ఆ!' పెద్దగా అంది.

"బాగా చూసుకోవటమంటే మంచిమంచి చీరలు కొనివ్వటం, కొన్నిసార్లు కొనుక్కోమని ఆమెకే డబ్బులీటం... చాలాసార్లు అంకుల్ టూర్‌కి వెళ్ళినపుడు నగలు... అవీ తీసుకురావటం... ఇవన్నీ బాగా చూసుకోవటమేగా!?" ఇంత చిన్న విషయం వీళ్ళకెందుకు అర్థం కాలేదా అనుకుంటూ చెప్పింది.

సుధవైపు చూసి విజయ చిన్నగా నవ్వింది.

సౌమ్య మాత్రం వాదనకి దిగింది.

"చూడు! బాగా చూసుకోవటమంటే మంచి చీరెలు... నగలు తీసుకురావటమేనా!? ఇంకేమీ అక్కర్లేదా?" సౌమ్య గొంతులో ధ్వనించిన కరుకుతనానికి సుధ కంగారు పడినా ధైర్యం కూడదీసుకొని అక్కకు సమాధానం చెప్పింది.

"అవును! అంతకంటే ఆడవాళ్ళకు కావాల్సిందేముంది? చెప్పమ్మా!" అంటూ వాళ్ళమ్మ సపోర్టు కోసం విజయవేపు తిరిగింది.

విజయ 'ఏం చెప్పాలా' అన్న సందిగ్ధతలో వుండగానే సౌమ్య మళ్ళీ మాట్లాడ్డం మొదలుపెట్టింది.

"సుధా! నీకు చాలాసార్లు చెప్పాను. ఆడపిల్లలు.. ఆడవాళ్ళు అనొద్దని. అమ్మాయి అనలేవు?

అమ్మాయిలు అక్కడి వాళ్ళు, ఆడవాళ్ళు ఎందుకు అవుతారు? ఇక్కడివాళ్ళు, ఈడవాళ్లు కాదా? ఇంకోసారి నువ్వు ఆడపిల్ల అనటం విన్నానంటే చెంపపగలగొడ్తాను" ఆవేశంతో వూగిపోతూ అంది. విజయ సౌమ్యవైపు ఆశ్చర్యంగా చూస్తూ, చేస్తున్న పని ఆపి నిలబడి పోయింది.

అక్కెందుకు సీరియస్‌గా అరుస్తుందో తెలీని సుధ రెండు నిమిషాల పాటు ఏం మాట్లాడాలో మర్చిపోయి నిల్చుండిపోయింది.

వెంటనే 'ఓడిపోకూడదు. పోట్లాడాలి' అని గుర్తొచ్చినట్టుంది.

"అవును! అమ్మాయిలను ఆడపిల్లలు అనకపోతే ఇంకేమనాలి? అందరూ అంతే అంటారుకదా! నాన్న, అమ్మ, అన్నయ్య అందరూ ఆడపిల్లే అంటారు కదా!

నువ్వూ, నేనూ, అమ్మ ఆడపిల్లలమే! ఒక్కసారి కాదు వందసార్లంటాను. ఆడపిల్ల... ఆడపిల్ల ఆడపిల్ల" అక్క మీదేదో విజయం సాధించినట్టుగా అరిచింది సుధ.

సౌమ్య కోపం ఆపుకోలేకపోయింది.

సుధ భుజమ్మీద గట్టిగా ఒక్క దెబ్బవేసి విసురుగా అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

ఒక్కసారిగా సుధ పెద్దరాగం అందుకుంది. ఏడ్వటం ప్రారంభించగానే విజయ తేరుకొని బుజ్జగిస్తూ సౌమ్యను తిట్టడం మొదలు పెట్టింది.

"నీకు రాను రానూ కోపం పెరిగిపోతోంది. నీకంటే చిన్నదాన్ని కొడ్తావా!? ఆడపిల్లలు ఇలా ప్రవర్తిస్తే రేపు పెళ్ళి చేసి అత్తవారింటికి పంపితే నిన్నుకాదు, నిన్నిలా పెంచినందుకు నన్ను..."

"నువ్వు కూడా ఆడపిల్లే అంటున్నావు! ఎన్నిసార్లు చెప్పినా మీకెందుకు అర్థం కాదో తెలీటంలేదు. తగిలించి వున్న షటిల్‌బాట్ తీసి కింద పెట్టింది. షూ వేసుకొని లేసులు కట్టుకుంటూ

"ఒకవేళ నేను పెళ్ళంటూ చేసుకొంటే... అత్తవారింటికెళ్తే, మాటంటూ వస్తే, అది నీకూ, నాన్నకూ ఇద్దరికీ సమంగా వస్తుంది. నన్ను పెంచే బాధ్యత, బుద్ధులు నేర్పించే బాధ్యత నీదే కాదు. మీ ఆయన్ది కూడా" అంటూ విసురుగా షటిల్ బాట్ వూపుకుంటూ వెళ్ళిపోయింది.

"చూడమ్మా! ఎలా అంటుందో" అన్న సుధ మాటల్తో విజయ ఈ లోకంలోకి వచ్చింది.

'ఈ పిల్ల ఇవ్వన్నీ తెలిసే మాట్లాడుతుందా! ఇన్ని ఆలోచన్లు ఎక్కణ్ణించొస్తున్నాయి? తనెందుకు సౌమ్యను గట్టిగా మందలించలేకపోతోంది?' అనేక

...ంగా ఆలోచించింది.

సౌమ్య చెప్పే విషయంలో చాలా నిజం వుందని తనకూ అన్పించింది. 'కానీ... ఇలా అయితే ఎలా?' అత్తవారింటికెళ్తే... పెళ్ళంటూ చేసుకుంటే అంటూ మాట్లాడుతుంది. అంటే దాని ఉద్దేశం ఏంటి? సౌమ్య మాటల్లో తప్పులేదనిపిస్తున్నా తానెందుకు కోప్పడుతున్నట్టు! అదీ మనస్ఫూర్తిగా కాక 'డ్యూటీ'గా ఎందుకు మందలించాల్సొస్తుంది ప్రతీసారీ. ఇలా ఆలోచనల్లో మునిగిన విజయ వంక చూస్తూ తన ఏడ్పుకు రావాల్సినంత అటెన్షన్ రాలేదని నిరాశపడ్డది సుధ.

నిష్ఠూరాలకి దిగింది.

"నాకు తెలుసు! నీకు అక్కంటేనే ఎక్కువిష్టం. ఎవ్వరింట్లో అక్కలు ఇలా మాట్లాడరు. చిన్నవాళ్ళని అస్సలు కొట్టరు. నువ్వు అదేం చేసినా ఏమీ అనవు. నాన్న కూడా అదంటే భయపడ్తాడు.

మీ అందరికీ అదంటే ఇష్టం" ఏడ్చింది. విజయకి ఏమనాలో తోచలేదు.

"చూడు...! ఈ రోజు నాన్నని 'మీ ఆయన' అంది. అయినా కూడా నువ్వు దాన్ని కొట్టలేదు. షటిల్‌కోర్టు దగ్గర 'అంతా అబ్బాయిలే వుంటారు వెళ్ళొద్దు' అని డాడీ చెప్పినా వెళ్తుంది. అయినా నువ్వేమీ అనవు. నాకు తెలుసు నాకు తెలుసు..."

సుధని ఓదార్చటం... ఏడ్పు మాన్పించటం విజయకి సాధ్యం కాలేదు. సుధ వెళ్ళాక చేసేదేమీ లేక మళ్ళీ తనాలోచన్లో పడ్డది. ఇంకా సౌమ్య మాటలు చెవుల్లో రింగ్ మంటున్నాయి.

"అంటే నిన్నొక్కదాన్నే కాదు... నాన్నను కూడా అంటారు"

"నన్ను పెంచే బాధ్యత... బుద్ధులు నేర్పించే బాధ్యత నీకే కాదు నాన్నక్కూడా వుంది" సౌమ్య అన్న మాటల ప్రభావం విజయపై చాలానే పడ్డది.

ఒక్కసారిగా సౌమ్య... సుధను చిన్నప్పట్నించి తను పెంచిన విధానం, తాను పడిన శ్రమ గుర్తొచ్చింది. ఏ మాత్రం సహాయం చేయని భర్త నిర్లక్ష్యం కళ్ళముందు కదిలింది.

పిల్లల్ని కనటం... సహజమైంది. పిల్లల పెంపకంలో ఏకపక్ష బాధ్యత స్త్రీకే ఆపాదించటం.... పిల్లల తప్పులకు తల్లినే బాధ్యురాల్ని చేయటం అన్నీ ఆలోచిస్తే తల తిరిగినట్టయింది. బలవంతంగా ఆలోచనల్ని కట్టిపెట్టింది.

బాట్ పట్టుకొని విసురుగా బైటికొచ్చిన సౌమ్య, సౌజన్య ఇంటికెళ్ళింది. సౌజన్యని కూడా తీసుకొని ఆటకు వెళ్దామనుకుంది. కానీ, నారాయణరావుగారి కుటుంబానికి సంబంధించిన ఆలోచనలు... అమ్మతో, చెల్లితో దురుసుగా ప్రవర్తించటం, చెల్లిపై చేయి చేసుకోవటం అన్నీ మనసును బాధపెడ్తున్నాయి.

'నేను కొట్టకుండా ఉండాల్సింది. పాపం తనకేం తెలీదు కదా! నాకైనా సౌజన్యక్కచెప్తేనే కదా అర్థం అయింది' అనుకుంది. అయినా సుధకి చాలాసార్లు చెప్పాను. విన్లేదు. కొట్టడం వల్లనైనా 'ఆడపిల్ల' అనటం మానేస్తుంది' అని తన పనికి జస్టిఫికేషనిచ్చుకుంది.

ఎప్పుడెప్పుడు సౌజన్యకు నారాయణరావు విషయం చెప్దామా అని వేగంగా అడుగులేసింది. ఇద్దరూ కూచున్నారు. సౌమ్య చెప్పిందంతా సౌజన్య వింది.

"సౌమ్యా! ఇంతకీ ఆంటీ ఎందుకు వెళ్ళిపోయారంటావు?" అడిగింది సౌజన్య.

"అదే నాకు అర్థం కావట్లేదక్కా! కానీ, ఇది నిజంగా అందరూ అంటున్నట్టు పిచ్చికాదన్పిస్తుంది. పాపం! ఆంటీ...." సౌమ్య మాట పూర్తి చేయకుండానే మళ్ళీ సౌజన్య అడిగింది.

"అయితే కారణమేమై వుంటుంది!"

"తెలీదక్కా!"

"అయితే నేననుకోనేది చెప్పే ముందు ఆంటీ ఫ్యామిలీ గురించి నీక్కొంచెం చెప్పాలి". ఆగి, చెప్పటం మొదలుపెట్టింది.

"ఆంటీ వాళ్ళది చాలా పెద్ద ఫ్యామిలీ. అంకుల్ బ్రేక్ ఇన్స్‌పెక్టర్. వాళ్ళకి మొత్తం ఏడుగురు అబ్బాయిలు. వాళ్ళ పిల్లలు నాకు సీనియర్లు. ఆంటీ వాళ్ళింట్లో అమ్మాయిలు ఎవ్వరూ లేరు. ఇంటి పన్చేయటానికి వచ్చేది కూడా అబ్బాయే! అంకుల్ వాళ్ళ వూరి నుంచి వచ్చాడతను. ఆంటీకి ఎప్పుడూ పనే!

ఇంట్లో ఎవ్వరూ సాయం రారు. కాని, అందరికీ అన్నీ టైంకి అందుబాటులోకి రావాలి. ఏడుగురూ అబ్బాయిలే అవటం, వాళ్ళు పన్జేయకపోవటానికి తోడ్పడుతుంది. తిన్నప్లేటు కూడా తీసి పక్కన పెట్టరు. భోజనానికి, టిఫిన్‌కి అంతా ఒకేసారి రారు. ఎవ్వరి వీలును బట్టి వాళ్ళు. ఇక ఆంటి కిచెన్‌లోకి డైనింగ్ టేబుల్‌దగ్గరికి గుండ్రంగా తిరుగుతూనే వుండాలి.

ఆదివారం వస్తే ఆంటీ బాధ అంతా ఇంతా కాదు. అందరి బట్టలూ ఉతకాలి. రకరకాలపనులు. ఎవరికేది ఇష్టమో ఆర్డరిస్తారు. కిందామీదా పడ్తూ అన్నీ చేసి పెట్టాలి.

నచ్చకపోతే విమర్శించటాలు. నచ్చితే రెండే నిమిషాలు పొగడ్తలు" చెప్పటం ఆపింది సౌజన్య.

"అమ్మో బాగా చేశావు. నువ్వు చేసినట్టు ఎవ్వరూ చేయరే అంటే ఆంటీ పొగడ్తలకి పొంగిపోవాలన్నమాట" వ్యంగ్యంగా అంది సౌమ్య.

"ఆంటీ పక్కింటి వాళ్ళతో మాట్లాడ్డానిక్కూడా టైం వుండదు. ఎప్పుడూ పనే! ఎప్పుడైనా కాసేపు నడుంవాల్చి కూచుందా! అంకుల్ తన కోసం వచ్చిన వాళ్ళకి 'టీ' పెట్టమంటారు. కాసేపు తనకిష్టమైన ఛానెల్ చూద్దామంటే అన్నయ్యల్తో గొడవలు. వాళ్ళలో వాళ్ళు గొడవ పెట్టుకుంటారు. ఆంటీ సర్దిచెప్పబోతే అంతా ఈమె మీద పడ్తారు. 'నీకేం తెలీదు. నోర్మూసుకో'మని ఈసడించుకుంటారు. అంకుల్ ఏదీ పట్టించుకోరు. ఆంటీతో సరిగా మాట్లాడరు..."

సౌమ్య మనసులో ఏదో మెరిసినట్లైంది. సౌజన్య మీదకొంగి "అక్కా! అందుకే ఆంటీ వెళ్ళిపోయారు కదూ!" ఆత్రంగా అంది. "నాకు తెల్సు! పిచ్చి గిచ్చీ ఏమీలేదు. ఇదంతా భరించలేకే అయ్యుంటుంది" అంది సౌమ్య.

"ఆంటీ ఏడ్గురు పిల్లలు కావాలని అనుకోలేదట! అమ్మాయి కోసం ఆంటీ అత్తగారు పట్టుబట్టారట!" సౌజన్య.

"అవును! నాతో ఆనందన్నయ్య అన్నారు" సౌమ్య అంది.

"సౌమ్యా! ఆంటీ మూడుసార్లు వెళ్ళిపోయారన్నావు గదా! ఎక్కడికెళ్ళారు? ఎలా వున్నారు? తిరిగెలా వచ్చారు?" సౌజన్య అడిగింది.

"అరె' చెప్పటం మర్చేపోయాను. ప్రతీసారీ ఏదో ఆశ్రమానికెళ్ళే వార్త! ఒకసారి తిరుపతికెళ్ళారు. ఆ తర్వాత అది అంకుల్‌కి ఎవరో ఫోన్జేసి చెప్పారట! అంకుల్ వెళ్ళి తీసుకొచ్చారట!

అంకుల్ వెళ్ళి రమ్మనప్పుడు ఆంటీ నిశ్శబ్దంగా వచ్చేవారట! మొండికేసే వాళ్ళు కాదుట! ఇంకోసారి చిత్తూరులో... మరోసారి ఇంకెక్కడో..." గబగబా చెప్పింది.

"ఆంటీ అలా ఇంట్లోంచి ఎందుకు వెళ్ళిపోతుందో మీ అమ్మకే తెలుసు. వాస్తవానికి ఆ పరిస్థితుల చట్రంలో చిక్కుకున్న ఏ స్త్రీ పరిస్థితి అయినా అంతే గందరగోళంగా, అయోమయంగా వుంటుంది.

ఒక స్త్రీ అనుభవానికి మరో స్త్రీ అనుభవానికీ మధ్య ఇటువంటి గందరగోళ పడే స్థాయిలో తేడా వుంటుందంతే!

ఇక్కడో విషయం! మీ అమ్మ, మా అమ్మ లాంటి వాళ్ళు ఈ పరిస్థితులను సర్దుకుపోవటం నేర్చుకున్నారు.

అయితే! ఆంటీలాంటి తెగింపు, ధైర్యం వున్న వాళ్ళు మాత్రమే ఇలా చేయగలరు" విశ్లేషించింది సౌజన్య.

"అవునక్కా! ఆంటీ స్పృహలో వుండే చేస్తున్నారు కదా!" ఆనందంగా అంది సౌమ్య. తన అంచనా కరక్టని సంతోషం.

"ఆంటీకి రిలాక్సేషన్‌కావాలి. జీవితంలో ఏదో వెలితి. వాటన్నిటికోసం... ఆంటీకి వేరే ప్రపంచం కావాల్సొచ్చింది. ఈ కుటుంబ హింస నుంచి బయటపడ్డానికి ఆంటీ చేసే ప్రయత్నం ఇది"

"కుటుంబ హింస!" ఆశ్చర్యంగా అంది సౌమ్య. ఆ పదంలోని విస్తృతమైన అర్థం తన చిన్నబుర్రకు అర్థమైంది.

"అవును! మన అమ్మ వాళ్ళముందు తరాలకి ఇదొక హింసన్న స్పృహే లేదు. బాధ్యతనుకున్నారు.

మన అమ్మ వాళ్ల నిజ స్వభావాన్ని అర్థం చేసుకోగలిగారు. మనం... మన తరం వాళ్ళం దీన్ని ప్రశ్నించటం మొదలుపెట్టాం! మన తర్వాతి తరం తప్పకుండా దీన్ని అధిగమిస్తారు. విజయం మనదే!" అంది సౌజన్య.

"అయ్యో! అక్కా! ఆంటీకి పిచ్చని నమ్ముతున్నవాళ్ళు... కాదని తెలిస్తే మళ్ళీ తీసుకురాక పోవచ్చు" సందేహంగా అంది సౌమ్య.

"ఈ రోజుకీ మెంటల్ ఎక్సర్‌సైజ్ చాలు" సౌజన్య బుగ్గ మీద ముద్దు పెట్టి ఇంటిదారి పట్టింది.

సౌమ్య ఇంటికి చేరుకొనే సరికి ముందుగదిలో కూచొని సుధ బొమ్మ వేసుకుంటుంది. సౌమ్యను చూసి మూతిముడ్చుకొని అటు తిరిగి కూచుంది.

చిన్నగా నవ్వుతూ చెల్లి దగ్గిరకెళ్ళి చెల్లిని ముద్దుపెట్టుకుంది. నవ్వుతూ 'సారీ' అంది.

"అమ్మలందరూ ఇంట్లోంచి వెళ్ళిపోకుండా వుండాలంటే మనం మారాలి... అందర్నీ మార్పించాలి" సుధని నవ్వించే ప్రయత్నం చేసింది.

అప్పుడే ఆ గదిలోకొచ్చిన రంగారావుకు ఆ మాటలర్థం కాలేదు. అర్థం చేసుకోవాలని కూడా ప్రయత్నించలేదు.

ఇల్లు వూడుస్తున్న విజయ ఆ మాటల వెనుక వున్న లోతైన భావాన్ని వూహించుకోడానికి ప్రయత్నిస్తోంది.

సౌమ్య తల్లి చేతిలోని చీపుర్ని తీసుకుంది. "దులపాల్సింది ఇంటి దుమ్మునే కాదు. నాన్నలు... అంకుల్స్ అన్నయ్యల్లో... చుట్టూ వున్నపురుషులందర్లోని పురుషాధిక్యతను..."

★

మధ్యతరగతి మర్యాదస్తులు

అంపశయ్య నవీన్

ఓ దగ్గరి మిత్రుడి కూతురు పెళ్ళికి హైదరాబాద్ వెళ్ళాను. ఆ మిత్రుడో పెద్దకాంట్రాక్టర్ కాబట్టి అతని కూతురి పెళ్ళికి చాలామందే వచ్చారు. చాలా కాలంగా కలవని ఎందరో చిన్నప్పటి స్నేహితులు కలిశారు. అందరమూ ఒకర్నొకరం ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నాం. పెళ్ళయిపోయి భోజనాలు కూడా చేశాక ఓ నలుగురు చిన్నప్పటి మిత్రులతో కలిసి మ్యారేజ్ హాల్లో ఓ మూల కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నాము. ఆ నలుగురు మిత్రుల్లో ఒకాయన యూనివర్సిటీలో ప్రొఫెసర్. ఇంకొకాయన రాజకీయాల్లో చురుగ్గా తిరుగుతుంటాడు. ఇంకొకాయన స్కూలు టీచర్ - నాల్గో ఆయన ఓ మధ్యతరగతి రైతు - మేం ఐదుగురం కాలేజీలో చదువుకునే రోజుల్లో క్లాస్‌మేట్స్‌మి కాకపోయినా సమకాలికులం కాబట్టి చాలా క్లోజ్‌గా ఉండేవాళ్ళం.

మేమలా మాట్లాడుకుంటుండగానే మా దగ్గరకు నారాయణమూర్తి అనే మరో మిత్రుడొచ్చాడు - ఈ నారాయణమూర్తిని గూర్చి నాకేమీ తెలీదు - ఆయనకు మా ఐదుగుర్లో మిగతా నల్గురితో మంచి పరిచయమే ఉందని తర్వాత నాకర్థమైంది.

నారాయణమూర్తిని చూడగానే మా మిత్రుల్లోని రాజకీయ నాయకుడు ఆయన దగ్గరకెళ్ళి ఆయన్ను గట్టిగా కౌగిలించుకున్నాడు.

"మూర్తిగారూ! బావున్నారా? ఎంతకాలానికి కలిశారండీ! మీ పిల్లలు బావున్నారా? మీ ఆవిడ బావున్నారా?" అంటూ కుశల ప్రశ్నలు వేశాడు.

"వ్వాట్ ఎ ప్లెజెంట్ సర్‌ప్రైజ్ మూర్తిగారూ! మీరిక్కడ కలుస్తారని నేను కలలో కూడా అనుకోలేదు. మీరామధ్య స్టేట్స్‌కు వెళ్ళారని విన్నాను - స్టేట్స్ నుండి ఎప్పుడొచ్చారు?" అన్నాడు మా ప్రొఫెసర్ గారు.

"మీరు ఆ మధ్య కలిసినప్పుడు మీ అమ్మాయికి పెళ్ళి సెటిలైందని చెప్పారు. మీ అమ్మాయి పెళ్ళికి నాకు ఇన్విటేషన్ పంపించలేదు. మేం చాలా చిన్న వాళ్ళం... మీకెక్కడ కనిపిస్తాంలెండి" అన్నాడు మాలో ఉన్న స్కూల్ టీచర్.

"అసలు మా అమ్మాయి పెళ్ళి కానేలేదు... ఎవరో పుణ్యాత్ములు నన్ను గురించి, మా ఆవిడ గురించి ఏవేవో అవాకులు, చెవాకులు చెప్పి ఆ పెళ్ళి కాకుండా చేశారులెండి" అన్నాడు నారాయణమూర్తి.

"అయ్యో పాపం! ఎంత దారుణం! మీలాంటి మంచి మనిషిని గూర్చి, అజాత శత్రువును గూర్చి చెడ్డగా చెప్పేవాళ్ళెవరుంటారండీ! అసలు మన సమాజంలో మీలాంటి మంచి వాళ్ళకు స్థానం లేదండి... అసలు మీరిప్పుడేం చేస్తున్నారు. ఏ ఊళ్ళో సెటిలయ్యారు? మీ ఆవిడగారేం చేస్తున్నారు? మీ ఆవిడగార్నయితే నేనెప్పుడూ మరచిపోలేదు. అప్పట్లో మా అమ్మాయినోదార్లో పెట్టి దానికో సంబంధం మాట్లాడి దాన్నో ఇంటిదాన్ని చేసింది మీ ఆవిడగారేనండి..." అన్నాడు మాలో వున్న స్కూల్ టీచర్.

"మా ఆవిడ ఎప్పటిలాగే ఇక్కడే హైదరాబాద్‌లో స్కూలు నడుపుతోంది... మేం ఇక్కడే హైదరాబాద్‌లోనే సెటిలయ్యాం" అన్నాడు నారాయణమూర్తి.

"స్కూలు బాగా నడుస్తోందాండీ?" అన్నాడు మాలో ఉన్న స్కూల్ టీచర్.

"ఫరవాలేదు. ప్రస్తుతం ఆ స్కూలే మా కుటుంబానికింత తిండి పెడ్తోంది. ఆ స్కూలే లేకపోతే మేం బజార్లో పడేవాళ్ళమే..." అన్నాడు నారాయణమూర్తి.

"అయితే ఇప్పుడు మీరేం చెయ్యడం లేదా?" అన్నాడు మాలో ఉన్న ప్రొఫెసర్‌గారు.

"రెడీమేడ్ గార్మెంట్స్ బిజినెస్‌చేస్తే బాగా నష్టమొచ్చింది. దాన్ని వదిలేశాను.... ఆ బిజినెస్ చేస్తున్నప్పుడే ఓసారి స్టేట్స్‌కు కూడా వెళ్ళొచ్చాను. ప్రస్తుతమైతే ఏమీ చెయ్యడం లేదు" అన్నాడు నారాయణమూర్తి.

"మీరు మొదట్లో గవర్నమెంట్ జాబేదో చేసే వాళ్ళు కదా... ఆ జాబేమయింది?" అన్నాడు మా రాజకీయ నాయకుడు.

"ఆ జాబ్‌లోంచి నన్ను తీసేశారు గదా... ఏవో కుకడప్ చార్జెస్ పెట్టి టెర్మినేట్ చేశారు. అప్పటి మా బాస్ నా మీదెందుకో నిష్కారణమైన ద్వేషం పెట్టుకొని నాకన్యాయం చేశాడు" అన్నాడు నారాయణమూర్తి.

"అవునులెండి - మీలాంటి మంచివాళ్ళకే కష్టాలొస్తాయి. మీరోసారి నాక్కూడా చాలా సహాయం చేశారు - మీకారణంగానే అప్పట్లో నాకు మండలాధ్యక్షుడిగా పోటీ చెయ్యడానికి మా పార్టీ టికెట్ దొరికింది" అన్నాడు మాలోని రాజకీయ నాయకుడు.

"అప్పటి మీ పార్టీ అధ్యక్షుడు నాకు క్లోజ్ ఫ్రెండ్! అందువల్లే మీకు నేను టికెట్ ఇప్పించగల్గాను" అన్నాడు నారాయణమూర్తి.

"మీరు నాక్కూడా ఓ సహాయం చేశారండోయ్ అప్పట్లో మార్కెట్లో ఎరువుల బస్తాలు యమషార్టేజిగా ఉండేవి. అట్లాంటి టైమ్‌లో మీరు నాకు రెండు యూరియా బస్తాలిప్పించారు అన్నాడు మాలోని వ్యవసాయదారుడు.

"ఆయనతో సహాయం పొందని వాళ్ళెవరు? నాకోసారి అర్జెంట్‌గా బి.సి. సర్టిఫికెట్ కావాలంటే నారాయణమూర్తిగారే వాళ్ళాఫీసు నుండి వెంటనే ఇప్పించాడు - ఆ సర్టిఫికెట్ లేకపోతే నాకస్సలు ఎం.ఏ.లో సీటు దొరికేదే కాదు. ఎం.ఏ. చదవకపోతే నేనీ ఉద్యోగంలోనే ఉండే వాణ్ణి కాదు. నిజమైన పరోపకార పరాయణుడంటే నారాయణమూర్తిగారే" అన్నారు మాలోని ప్రొఫెసర్‌గారు-

కాస్సేపు అందరితో మాట్లాడి నారాయణమూర్తి అక్కణ్ణించి వెళ్ళిపోయారు - అతడలా వెళ్ళిపోగానే

"అసలు ఇతని ఉద్యోగం ఎందుకు పోయిందో తెలుసా?" అన్నాడు రాజకీయనాయకుడు.

"తెలీదే?" అన్నాడు మాలోని స్కూల్ టీచర్

"వీడు వాళ్ళ బాస్ వైఫ్‌కే సూటిపెట్టాడు. అది కూడా చాలా త్వరగానే వీడి వలలో పడిపోయిందట - దాంతో వీళ్ళ బాస్ వీణ్ణి ట్రాప్ చేసి ఆంటీ కరప్షన్ వాళ్ళకు రెడ్‌హాండెడ్‌గా పట్టించాట్ట..."

"ఈ మాట నేనూ విన్నాను..."

"వీడో పెద్ద ఉమనైజర్... గమ్మత్తేమిటంటే ఇతన్ది లవ్‌మ్యారేజ్... ఇతని కాస్ట్ వేరు, ఆమె కాస్ట్ వేరు - ఆమెది అప్పర్ కాస్ట్... వాళ్ళు బాగా వున్న వాళ్లు... ఆమె తన సర్వస్వాన్ని వదిలేసి ఇతని ప్రేమలో పడి ఇతనితో వచ్చేసింది. ఇతడేమో చాలా త్వరగానే ఆమెనొదిలేసి ఎక్కడ ఓ అందమైన స్త్రీ కనిపిస్తే ఆమె వెంటపడి తిరుగుతున్నాడు. రకరకాల బిజినెస్‌లు చేసి అన్నింట్లో చెయ్యి కాల్చుకున్నాడు. అప్పట్లో ఓ రిచ్ విడోను పట్టాడు. ఆమె ఇతగాడికి ఓ పెద్ద కంపెనీ వాళ్ళ రెడీమేడ్ గార్మెంట్స్ ఏజెన్సీ ఇప్పించింది. అప్పుడే ఓ వెలుగు వెలిగాడు. కార్లల్లో, విమానాల్లో తిరగడం మొదలెట్టాడు. ఏరుదాటంగానే తెప్ప తగలేసేరకం కదా! అంత సహాయం చేసిన ఆ విడోని వదిలేసి మరో ఆమె వెంట పడ్డాడుట! ఆమె ఊరుకుం టుందా? రెడీమేడ్ గార్మెంట్స్ ఏజెన్సీని పీకించేసింది- వీడు మళ్ళీ వీధుల్లో పడ్డాడు -ఇప్పుడేమో పెళ్ళాం తెచ్చి పెడ్తే తింటూ మళ్ళీ ఎవరిని పడదామా అని చూస్తున్నాడు..."

వాళ్ళ మాటలు వింటుంటో నాకు ముళ్ళ మీద కూర్చున్నట్టుగా అనిపించింది. వాళ్ళ మాటల్నిక భరించలేక "అతడు మన మధ్యలో ఉన్నంత సేపూ అతన్ని పరోపకార పరాయణుడనీ, మరేదో అని పొగిడేశారు. మీరంతా అతనితో ఏదో ఒక సహాయాన్ని పొందామని చెప్పిన వాళ్ళే... అతడలా వెళ్ళిపోయాడో లేదో అతణ్ణి గురించి, అతని ఫ్యామిలీగురించి ఇట్లా నీచంగా మాట్లాడటం సంస్కారం అనిపించుకోదు" అంటూ నేను లేచి నిల్చున్నాను-

"అతన్నేదో అంటే మీకెందుకు సార్ ఇంత కోపం" అంటూ నన్నేదో సముదాయించబోయాడు మా .రాజకీయ నాయకుడు-

నేను వాళ్ళ మధ్యలోంచి వెళ్ళిపోయాను. వాళ్ళంతా మధ్యతరగతి మర్యాదస్తులు! ★